క్లుప్తంగా

సాయిబాబాకు ముత్యాల హారం బహూకరణ



ఆలయ కమిటీ సభ్యులకు ముత్యాల హారం అందజేస్తున్న దేముడుబాబు దంపతులు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని షిర్డీ సాయిబాబా ఆలయానికి సబ్బవరం శివారు ఆదిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బైలపూడి దేముడుబాబు,అరుణ దంపతులు ముత్యాల హారాన్ని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గెడ్డం కృష్ణ,కోరాడ శ్రీనివాసరావు,దంగేటి ప్రసాదరావు,దనిమిరెడ్డి శ్రీనివాసరావు,బర్ల రమణ,గెడ్డం రమేష్,ఎడ్ల నాయుడు,కోళ్లి కృష్ణ,సత్యం నాయుడు,చిత్రాడ శ్రీను,లాలం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి రూ.25 వేల సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మల్లునాయుడుపాలెం పూర్వ విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడు పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు తమ ఉదారత చాటుకున్నారు. పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి తమతో కలిసి చదివి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అయ్యన్నపాలేనికి చెందిన బొమ్మ ఆంజినేయులు కుటుంబానికి ఆదివారం రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడుతో పాటు లావేటి రవికిరణ్,కోన గణేష్,గండి త్రినాథ్,తుంపాల శివ,నక్కెళ్ల రామునాయుడు, గండ్రెడ్డి బాలరాజు,నేబర్తి కృష్ణ,గండి గజపతి నాయుడు తదితరులు ఉన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన తప్పనిసరి



ఉచిత వైద్య శిబిరంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు

తుమ్మపాల: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుభద్ర సూచించారు. స్థానిక రోటరీ తాటికొండ నూకయ్య శెట్టి మెమోరియల్ హాల్లో మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి(విశాఖ) ఆధ్వర్యంలో ఉచిత రొమ్ము, గర్భాశయ, నోటి క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. పట్టణ, పరిసర గ్రామాల నుంచి వచ్చిన 80 మంది స్త్రీ, పురుషలకు వైద్యులు డాక్టర్ సుధానంద, డాక్టర్ సుకన్య పరీక్షలు జరిపి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్(ఉచిత క్యాంప్) చైర్మన్ డాక్టర్ శ్యామ్‌సుందర్, క్లబ్ అధ్యక్షుడు ఎస్.రాజేష్ కుమార్, కార్యదర్శి అనిల్, బుద్ధ రమణాజీ, నూకయ్య శెట్టి, ముప్పన సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కార్యాచరణ



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యారులు

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం తొలి సమావేశం ఆదివారం నిర్వహించారు. 1963 నుంచి 2024 వరకు చదువుకున్న విద్యార్థులు ఇటీవల సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఆ కార్యవర్గం సమావేశమై భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యాచరణపై చర్చించారు. పూర్వ విద్యార్థులను సమీకరించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. మరో సమావేశం నిర్వహించి అందరి సభ్యుల ఆలోచనలు సమీకరించి నిర్ణయాలు తీసుకోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మజ్జూరి శ్రీనివాస్, కార్యదర్శి వైఎస్ ప్రసాద్, సహాయ కోశాధికారి కోనేటి సత్తబాబు, ఉపాధ్యక్షుడు మేడిది రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణలో తరించిన భక్తజనం

- భక్తుల సేవలో స్వచ్ఛంద సంస్థలు
- రద్దీగా మారిన పాత గోశాల జంక్షన్
- భక్తులతో కిక్కిరిసిన ఆర్టీసీ బస్సులు



భక్తులకు పొంగలి పంపిణీ చేస్తున్న లక్ష్మీకాంత్‌నాయక్ బృందం



పాత గోశాల జంక్షన్‌లో భక్తులతో రద్దీగా వెళ్తున్న ఆర్టీసీ బస్సులు



భక్తులు సమర్పించిన కొబ్బరి చెక్కలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని స్మరిస్తూ శనివారం గిరి ప్రదక్షిణలో లక్షలాదిమంది భక్తులు తరించారు. భక్తి శ్రద్ధలతో 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ పూర్తి చేశారు. మదినిండా స్వామిని నింపుకుని తిరుగుపయన మయ్యారు. పలువురు భక్తులు ఆదివారం ఆలయ ప్రదక్షిణలో పాల్గొని మొక్కు తీర్చుకున్నారు.

కిటకిటలాడిన పాతగోశాల కూడలి

గిరి ప్రదక్షిణ ముగించుకుని తిరుగుపయనమైన భక్తులతో పాత గోశాల కూడలి కిటకిటలాడింది. అక్కడ నుంచి నగరంలోకి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉండడంతో భక్తులంతా పెద్ద ఎత్తున పాత గోశాల కూడలికి చేరుకున్నారు.

భక్తుల సేవలో ..

- సింహగిరిపై ఆదివారం జరిగిన ఆలయ ప్రదక్షిణకు వచ్చిన భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు సేవలందించాయి.
- ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్ పరివారం ఆలయ దక్షిణరాజగోపురం మార్గంలో భక్తులందరికీ మధ్యాహ్నం వరకు పెద్ద ఎత్తున పొంగలి ప్రసాద వితరణ చేశారు.
- సింహగిరి వర్తక సంఘం ఆధ్వర్యంలో 5 వేల మంది భక్తులకు టీ, రెండువేల బిస్కట్‌ప్యాకెట్లు, ఆరువేలమంది భక్తులకు పొంగలి, కదంబం ప్రసాదం అందజేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వర్తక సంఘం అధ్యక్షుడు ముగ్గు కిరణ్, ఉపాధ్యక్షుడు ఎస్.పైడిరాజు, కోశాధికారి దొంతల శంకర్, సభ్యులు బంటుబిల్లి సురేష్, కె.మురళి,జి.వరహాలరావు, వర్తకులు సతీష్, పండు, చిన్ని, శివ, ఆనందరావు, వాసు, రత్నాకర్, పండు పాల్గొన్నారు.
- సింహగిరిపై సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో అన్నప్రసాద భవనంలో భక్తులందరికీ విరివిగా కదంబం, దద్ధోజనం అందజేశారు.
- గోశాల జంక్షన్‌లో విశాఖ జిల్లా చిల్లర వ్యాపారుల వర్తక సంఘం ఆధ్వర్యంలో ఇండ్లీ అందించారు.
- పాత గోశాల వద్ద ఎస్‌వీఎల్‌ఎన్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో భక్తలకు టీ,ఫ్రూట్‌జ్యూస్ అందజేశారు.
- గోపాలపట్నం నుంచి సింహాచలం వచ్చే మార్గంలో ప్రహ్లాదపురం సమీపంలో లక్కీ షాపింగ్‌మాల్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు భక్తులకు ఉప్మా పంపిణీ చేశారు.
- బీహెచ్‌పీవీ కాలనీ ఆధ్వర్యంలో ప్రహ్లాదపురంలో పొంగలి, బిస్కెట్లు, బాదంపాలు అందజేశారు.
- అడవివరం ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం సింహగిరిపై మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. భక్తులకు వైద్య సేవలు అందజేశారు.
- సింహాచలంలోని మారుతీ కల్యాణమండపం వద్ద సింహాద్రి మఠం ఆధ్వర్యంలో భక్తులకు కదంబం ప్రసాదం అందజేశారు. పీఠం గురుస్వామి భక్తులకు స్వయంగా ప్రసాదం పంచిపెట్టారు.



వర్తక సంఘం ఆధ్వర్యంలో భక్తులకు పొంగలి అందజేస్తున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి



సింహగిరిపై అన్నప్రసాద భవనంలో భక్తలకు ప్రసాదం అందిస్తున్న దేవస్థానం సిబ్బంది



సింహగిరిపై భక్తులకు మందులు అందజేస్తున్న అడవివరం ఆరోగ్యకేంద్రం వైద్యులు, సిబ్బంది



పాత గోశాల జంక్షన్‌లో విశాఖ జిల్లా చిల్లర వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో ఇడ్లీ పంపిణీ

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు



పూజలందుకున్న రాజరాజేశ్వరీదేవి



దక్షవాటిలో నిర్వహిస్తున్న చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సహస్రాక్షి అమ్మవారి సన్నిధిలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు,పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సమాంతరంగా దక్షవాటిలోని ఏర్పాటు చేసిన 27 హోమ గుండాల వద్ద భక్తులు తమ స్వహస్తాలతో శత చండీ హోమం నిర్వహించారు. సాయంత్రం గురు పాదుకలను ఊరేగింపుగా పల్లకిలో శ్రీమేరు ప్రదక్షిణ చేయించారు.గురుమాత అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ శ్రీమాత అందరికీ కరుణా కటాక్షాలు కురిపిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.గురు పూజోత్సవంలో గురునామావళి సహిత షోడశోపచార పూజలు,భజనలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. సాయంత్రం బెంగళూర్‌కు చెందిన ప్రముఖ భరతనాట్య కళాకారిణి మౌనిక శిష్యురాలు దేవసేన ప్రదర్శించిన భరతనాట్యం ఆకట్టుకొంది.

నిరాశ్రయుడికి జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం



నిరాశ్రయుడిని షెల్టర్‌కు తీసుకొస్తున్న మమత

విశాఖ విద్య: ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్న ఓ వ్యక్తికి ఆదివారం బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. పరవాడ ఏరియాలో ఫుట్‌పాత్‌పై కొన్ని రోజులుగా ఓ వ్యక్తి ఉంటున్నాడనే సమాచారంతో బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత అక్కడికి వెళ్లి వివరాలు సేకరించారు. ఫుట్‌పాత్‌పై ఉన్న అతనికి ఎవరూ లేరని తెలుసుకొని సపర్యలు చేసి షెల్టర్‌కు తీసుకొచ్చారు. మతిస్థిమితం కూడా సరిగా లేకపోవడంతో అతనికి అవసరమైన వైద్యం అందించే ఏర్పాట్లు చేసినట్లు మమత తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



ద్వారకా పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ శ్రీను

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్‌ఐ శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి నేరాలు చేయకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలన్నారు. ఎటువంటి గొడవల్లో తలదూర్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీరు చేసే పనులపై ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు ఎస్‌ఐ సూచించారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులకు పోలీస్ సిబ్బంది అప్పగించారు.

సత్ప్రవర్తనతో మెలగాలి


మర్రిపాలెం: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని కంచరపాలెం ఐదో పట్టణ ఏఎస్‌ఐ ఆదిరాజు సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎటువంటి నేరాలకు పాల్పడకూడదని, గొడవల్లో తలదూర్చకూడదన్నారు. నేరాల జోలికి వెళ్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎల్లప్పుడూ రౌడీషీటర్లపై పోలీస్ నిఘా ఉంటుందని, బుద్ధిగా నడుచుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ చదువులు అంతంతే..

- ఇంకా చేరని పీపీ – 1, పీపీ – 2 పుస్తకాలు
- పాత పుస్తకాలతోనే బోధన
- ప్రైవేట్ స్కూళ్ల వైపు తల్లిదండ్రుల చూపు



పీపీ - 1 పుస్తకం



పీపీ - 2 పుస్తకం



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బోధిస్తున్న టీచర్

పెదగంట్యాడ: బాల్య దశలో విజ్ఞానం పెంపొందించడంతోపాటు ఆంగ్ల మాధ్యమంలో చిన్నారులు పట్టు సాధించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన బొమ్మలు, పుస్తకాలను ఆయా కేంద్రాలకు అందజేసేది. కేంద్రాలకు వచ్చే మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ఆంగ్ల బోధన అందించాలనే ఉద్దేశంతో నాలుగు పుస్తకాలతో కూడిన పీపీ - 1, పీపీ - 2 కిట్లు అందించింది. ఈ కేంద్రాల్లో ప్రైవేట్ స్కూల్ తరహాలో ఆంగ్ల బోధన అందించడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేందుకు ఆసక్తి చూపేవారు. బోధనకు సంబంధించి 2 నుంచి 4 ఏళ్లలోపు చిన్నారులకు ఆంగ్లం, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ, డ్రాయింగ్‌కు సంబంధించి ఐదు పుస్తకాలతో కూడిన పీపీ - 1 కిట్లు, 4 నుంచి 5 ఏళ్ల వయసు కలిగిన చిన్నారులకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ - 2 కిట్లు అందించేవారు.

పాత పద్ధతిలోనే బోధన

పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి పెదగంట్యాడ సెక్టార్‌లో 25 కేంద్రాలు ఉండగా ఇస్లాంపేట సెక్టార్ పరిధిలో 26 కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వీటిలో సుమారు 3 వేల మంది వరకూ చిన్నారులు ఉన్నారు. వీరికి ఇప్పటి వరకూ పీపీ – 1, పీపీ – 2 పుస్తకాలు నేటి వరకు అందకపోవడంతో పాత పద్ధతిలోనే పాఠాలు బోధిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు దాటుతున్నా కొత్త ప్రభుత్వం ఇంకా పుస్తకాలు అందించలేదు. గత ప్రభుత్వంలో సకాలంలో పుస్తకాలు అందించడంతోపాటు వాటిలో చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడే పాఠ్యాంశాలు ఉండడంతో తల్లిదండ్రులు విధిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేవారు. నేడు పుస్తకాలు రాకపోవడంతో ఇప్పటికే చాలా మంది తల్లిదండ్రులు ప్రైవేటు స్కూళ్లలో చేర్పించడానికి సిద్ధపడుతున్నారని తెలుస్తోంది. చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరేలా వారికి అవసరమైన వసతులు కల్పించాల్సి ఉన్నా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని బాలల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త పుస్తకాలు రాలేదు

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి కొత్త పుస్తకాలు ఇంకా ప్రభుత్వం నుంచి రాలేదు. పాత పుస్తకాలలోని కొంతమేర సిలబస్ మార్చే అవకాశం ఉంది. పుస్తకాలు వచ్చిన వెంటనే అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిస్తాం. ప్రస్తుతం కేంద్రాల్లో ఉన్న పుస్తకాలతోనే చిన్నారులకు బోధిస్తున్నాం

–నీలవేణి, సీడీపీవో, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పెందుర్తి

రోడ్లు ఇలా.. రాకపోకలెలా?

- శిథిలమైన గ్రామీణ రహదారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



గుంతలమయంగా మెట్టపాలెం రహదారి



అధ్వానంగా పరవాడ వేబ్రిడ్జి వద్ద రోడ్డు

పరవాడ: మండలంలోని పలు రహదారులు శిథిలావస్థకు చేరాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలతో పాటు కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. రహదారులను అభివృద్ధి చేయాలని అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి

మండలంలోని పరవాడ- యలమంచిలి రహదారిలో సినిమాహాలు కూడలి సమీపంలో రోడ్డు అధ్వానం తయారైంది. అడుక్కోక గుంత ఉండడంతో ప్రయాణికులు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఏ మాత్రం వర్షం పడినా ఈ ప్రాంతం నీటితో నిండిపోయి పెద్ద చెరువును తలపిస్తోంది. ఫలితంగా భారీ వాహనాలతో పాటు మిగిలిన వాహనాల రాకపోకలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. మరో వైపు ఈ రహదారిలో వీధిలైట్లు లేని కారణంగా రాత్రి సమయంలో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

- వాడచీపురుపల్లి శివారు వెంకటాపురం రహదారి దుస్థితి దయనీయంగా ఉంది. రెండు కిలో మీటర్ల నిడివి కలిగిన ఈ రోడ్డు రాళ్లు తేలిపోయి భారీ గుంతలతో నడవడానికి కూడా పనికిరాకుండా ఉంది. అధికారులు స్పందించి కనీసం మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.
- నాయుడుపాలెం శివారు మెట్టపాలెం గ్రామానికి ఏర్పాటు చేసిన రహదారి శిథిలమైంది. ఈ రహదారితో కూరగాయల రైతులు ప్రతి నిత్యం అవస్థలు పడుతున్నారు. గుంతల వల్ల సిటీ బస్సులు తరచూ మరమ్మతులకు నోచుకుంటున్నాయని సిబ్బంది చెబుతున్నారు.
- లంకెలపాలెం–సబ్బవరం రోడ్డు నరకానికి కేరాఫ్‌గా మారింది. నిత్యం బూడిద లారీల రాకపోకలతో రోడ్డంతా శిథిలమైంది. ఎక్కడికక్కడ పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాల మీద ప్రయాణం ప్రమాదంగా మారిందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- పరవాడ–గాజువాక రహదారిలో దేశపాత్రునిపాలెం నాలుగు రోడ్ల కూడలి భారీ గుంతలమయంగా మారింది. ఎన్టీపీసీ నుంచి తరచూ వందల సంఖ్యలో ప్రయాణిస్తున్న బూడిద లారీల వల్ల రోడ్డంతా ధ్వంసమైంది. చిన్నపాటి వర్షానికి కూడా గుంతల్లో నీరు చేరడంతో వాహనదారులు గుంతలను గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు.




రాళ్లు తేలిన వెంకటాపురం రహదారి



శిథిలమైన పెదముషిడివాడ రోడ్డు

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు



రక్తదానం చేస్తున్న సభ్యులు

భీమునిపట్నం : రక్తదానం ఎంతో గొప్ప విషయమని, తద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చని భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు అన్నారు. కీతిన్‌పేటలో అసోసియేషన్, యరబాల చారిటీ సమయుక్తంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు, ఇతర సందర్భాల్లో అవసరమైన వారికి తమ వంతు సాయం అందివ్వడానికి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. యరబాల చారిటీ చైర్మన్ యరబాల ప్రసాద్ మాట్లాడుతూ తరచూ ఇటువంటి శిబిరాలు ఏర్పాటు చేసి అవరమైన వారిని వెంటనే ఆదుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 80 మంది రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు బ్లిస్ క్యాటరింగ్స్ ఎండీ లక్ష్మీ లావణ్య బహుమతులు అందించారు. గంటా నూకరాజు, ఎం.సూర్యశ్రీనివాస్, కాళ్ల సన్ని, ఎ.కిశోర్, ఆర్.బసవ కృష్ణమూర్తి, ఎం.ఆదిత్య, వి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

యోగా సాధనతో ఆరోగ్యకర జీవితం

తుమ్మపాల: యోగాతో పరిపూర్ణ జీవనం సాధ్యమని, ఆరోగ్యకర జీవితానికి గురువులు నేర్పే విద్యే సరైన మార్గమని భారత్ స్వాభిమాన ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు, యోగా గురువు భీశెట్టి దొరమ్మనాయుడు, కార్యదర్శి మంగయ్య అన్నారు. గురుపౌర్ణమి పురస్కరించుకుని పట్టణంలోని జార్జ్ క్లబ్‌లో భారత్ స్వాభిమాన ట్రస్ట్ పతంజలి యోగా వారి ఆధ్వర్యంలో జార్జిక్లబ్ అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగి నాయుడు, సభ్యులు కోలపర్తి కన్నబాబు, బి.శ్రీనివాసరావులు గురువులను సత్కరించి, వారు తమ జీవితాల్ని ఎలా మార్చారో వివరించారు. తమకంటే ఉన్నతంగా స్థిరపడాలనే తపనతో గురువులు నిరంతరం శ్రమిస్తారని కొనియాడారు. యోగా గురువులు మాట్లాడుతూ ప్రకృతి ద్వారా వచ్చే ఫలహారాలను భుజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ, ప్రకృతితో మమేకమవ్వాలన్నారు. శ్వాస పై ధ్యాస ఉంచుతూ, ఓంకార నామాన్ని జపిస్తూ, పతంజలి విరచిత యోగాసనాల ద్వారా ఆరోగ్యకరంగా జీవించాలని సూచించారు. ఉన్నత వ్యక్తిత్వాన్ని అలవర్చుకుంటూ ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదుగుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ఆచరిస్తూ ప్రపంచానికి సనాతన ధర్మాలను పరిచయం చేయడమే యోగా ధ్యేయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కొణతాల శివాజీ, కేవీవీ సత్యనారాయణ, కాండ్రేగుల చిన్న, ఆళ్ల సూర్య రామకృష్ణ, కొణతాల పెద్ద, వంశీధర్, రోహిణి, రవణమ్మ, వివిధ ప్రాంతాల యోగా సాధకులు పాల్గొన్నారు.